సింగరేణి అద్దె వాహనాల బిల్లులు చెల్లించాలి

డ్రైవర్లు, ఓనర్ల డిమాండ్

సమ్మె చేస్తున్న శ్రీరాంపూర్ సింగరేణి అద్దె వాహనాల డ్రైవర్లు

శ్రీరాంపూర్, జూన్ 8 : సింగరేణి వ్యాప్తంగా నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్నా యాజమాన్యం స్పందించడం లేదని డ్రైవర్లు, ఓనర్లు మండిపడ్డారు. శనివారం శ్రీరాం పూర్‌లో 150 అద్దె వానాల డ్రైవర్లు విధులు బహిష్కరించి సమ్మె చేశారు. అద్దె వాహనాల సంఘం నాయకులు మోహన్, కుమార్, మహేశ్, కిరణ్, శేఖర్, మల్లేశ్, సదయ్య, సతీష్ మాట్లాడుతూ తమ వద్ద చేస్తున్న సీఎంపీఎఫ్‌కు బదులుగా ఈపీఎఫ్ రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. తమ వద్ద 8 గంటలకు మాత్రమే ఈపీఎఫ్ రికవరీ చేయాలన్నారు. వాహనాల టెండర్ కాలం 5 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. 3 నెలలుగా బిల్లులు, జీతాలు చెల్లించడం లేదన్నారు. అద్దె వాహనాల రెంటు రూ. 60 వేల నుంచి రూ. 80 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు.

ప్రమాదరహిత సింగరేణిగా మారుద్దాం

మాట్లాడుతున్న ఏరియా రక్షణ అధికారి రవీందర్

రామకృష్ణాపూర్, జూన్ 8: 'బాధ్యతతో రక్షణను పాటిద్దాం–ఏబీసీడీ పాటిస్తూ ప్రమాద రహిత సింగరేణిగా మారుద్దాం' అని ఏరియా రక్షణ అధికారి రవీందర్ అన్నారు. శనివారం బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం గురువయ్య ఆదేశాల మేరకు మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ సీహెచ్‌పీలో ప్రత్యేక రక్షణ డ్రైవ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2015 నుంచి జూన్ నెలలోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రమాదాల దృష్ట్యా రక్షణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. అట్టిట్యూడ్, బిహేవియర్, కల్చర్, డిసిప్లిన్ సక్రమంగా పాటిస్తూ రక్షణలో జీరో హార్మ్స్ సాధించవచ్చన్నారు. రక్షణ అనేది ఇంటినుండే మొదలవ్వాలని, స్టార్ట్ ఎర్లీ, డ్రైవ్ స్లోలీ, రీచ్ సేఫ్టీ విధానం పాటించాలని సూచించారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించి కార్మికులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ నాగరాజు, సీహెచ్‌పీ ఇన్‌చార్జి చంద్రమౌళి, ఈఈ అనుదీప్ పీఏ నరేంద్ర, శ్రీకాంత్ సూపర్‌వైజర్లు కే. శ్రీనివాస్, వేణు జే. శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో
జిల్లాకు పేరు తేవాలి

బ్యాడ్మింటన్ క్రీడాకారులకు మెమొంటో అందజేస్తున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాలటౌన్, జూన్ 8 : క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరు తేవాలని మంచిర్యాల కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంచిర్యాలలోని గ్రీన్ సిటీలో గల మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల ప్రారంభోత్సవానికి అదనపు కలెక్టర్ రాహుల్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టాస్ వేసిన అనంతరం కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్ కాసేపు బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అదనపు కలెక్టర్ రాహుల్ మాట్లాడుతూ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ క్రీడాకాలను బాగా ప్రోత్సహిస్తున్నదన్నారు. జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం జాతీయస్థాయి బ్యాడ్మింటన్ ర్యాంకింగ్ టోర్నమెంట్లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించిన 8 మంది క్రీడాకారులు, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను కలెక్టర్, అదనపు కలెక్టర్ మెమొంటోలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లూరు సుధాకర్, చీఫ్ అడ్వైజర్ గాజుల ముఖేశ్‌గౌడ్, ట్రెజరర్ సత్యపాల్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ రమేశ్‌రెడ్డి, మధు, కార్యవర్గ సభ్యులు పళ్లెం రాలింగు, కృష్ణ, లక్ష్మీనారాయణ, బ్యాడ్మింటన్ కోచ్ నరేందర్, రూబీ అకాడమీ బాధ్యుడు నరసింహస్వామి పాల్గొన్నారు.

పది దాటితే అనుమతి ఉండదు

నస్పూర్, జూన్ 8 : నేడు నిర్వహించనున్న గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు ఉదయం పది గంటల్లోపే అభ్యర్థులు కేంద్రాల్లోకి రావాలని, ఆపై వచ్చిన వారికి అనుమతి ఉండదని కలెక్టర్ బదావత్ సంతోష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష నిర్వహిస్తారని, ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు మాత్రమే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని పేర్కొన్నారు. 9.30 గంటలకు బయోమెట్రిక్ అటెండెన్స్ ప్రారంభమవుతుందని, బయోమెట్రిక్ అటెండెన్స్ ఇవ్వకుండా ఏ అభ్యర్థి కూడా పరీక్ష కేంద్రం నుంచి బయటకు వెళ్లరాదని తెలిపారు. జిల్లాలో 27 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, 9,384 మంది పరీక్ష రాయనున్నారని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థుల సాయంకోసం హెల్ప్‌లైన్ 08736–250500ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్యేలపై ఎందుకంత కోపం..?!

- ఆరు నెలల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- అందుబాటులో లేకపోవడం, అనుచిత నిర్ణయాలే కారణమంటున్న విశ్లేషకులు
- అభివృద్ధిపై పట్టింపు కరువు
- పాత పనులు చేయనివ్వరు.. కొత్తవి చేయరు..
- హామీల్లో ఒక్కటీ అమలు కాలే
- పాలకుల తీరుపై మండిపడుతున్న జనం
- పార్లమెంట్‌లో ఎన్నికల్లో భారీగా తగ్గిన మెజార్టీ

మంచిర్యాల, జూన్ 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా గడవకముందే కాంగ్రెస్ పార్టీపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. మంచిర్యాల జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉందనడానికి మొన్నటి పార్లమెంట్ ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఇక్కడి ఎమ్మెల్యేలపై జనానికి ఉన్న కోపమే.. కాంగ్రెస్ అభ్యర్థి వంశీకి తక్కువ మెజార్టీ వచ్చేలా చేసిందని స్పష్టమవుతున్నది. జిల్లాలో మూడు నియోజకవర్గాలు మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఈ మూడు నియోజకవర్గాల్లో ఆ పార్టీకి దాదాపు లక్ష న్నర మెజార్టీ వచ్చింది. కానీ, ఎంపీ ఎన్నికల్లో 68 వేల మెజార్టీ మాత్రమే వచ్చింది. సగానికి సగం మెజార్టీ పడిపోగా, కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందని జిల్లాలోని మేధావులు, విద్యావంతులు, విశ్లేషకులు చెబుతున్నారు. ముగ్గురు ఎమ్మెల్యేల వ్యవహార శైలే జిల్లాలో హస్తం పార్టీ వన్నె తగ్గడానికి కారణంగా తెలుస్తున్నది. ముగ్గురికి ముగ్గురూ.. ఎవ్వరూ నియోజకవర్గ కేంద్రాల్లో అందుబాటులో ఉండడం లేదు. కష్టం చెప్పుకునేందుకు వెళ్లే జనాలు ఎమ్మెల్యేలు లేరని తెలిసి నిరాశతో వెనుతిరిగి పోవాల్సి వస్తున్నది. ఎప్పుడో ఓసారి ఎమ్మెల్యేలు వస్తున్నా.. అధికారిక కార్యక్రమాలు, పర్యటనలు, పనుల్లో బిజీగా గడిపి తిరిగి వెళ్లిపోతున్నారు. కారణాలు ఏవైనా ఎమ్మెల్యేలైతే లోకల్‌గా ఉండడం లేదు. ఇది జనంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది.

అనుచిత నిర్ణయాలు కారణమే..

ఇక ఎమ్మెల్యేలు తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలు సైతం కాంగ్రెస్‌కు ఓట్లు తగ్గడానికి కారణంగా మారాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంలో గత కేసీఆర్ సర్కారు ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టింది. ఇప్పటికీ అనేక పనులు కొనసాగుతున్నాయి. ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు, మెడికల్ కాలేజీ, హాస్పిటల్ నిర్మాణాల్లో ఉన్నాయి. వీటన్నింటిని మార్చేస్తానంటూ, కూలగొట్టేస్తానంటూ ఎమ్మెల్యే ప్రకటనలు చేశారు. ఇక వీటికంటే ముఖ్యమైనది మంచిర్యాల– అంతర్గాం బ్రిడ్జి నిర్మాణాన్ని ఆపడం కూడా కాంగ్రెస్‌కు పెద్ద మైనస్‌గా మారింది. మంచిర్యాల పట్టణ వాసులకు ఉపయోగపడే బ్రిడ్జిని ఆపేసి, ఎక్కడో పక్క ఊరు నుంచి బ్రిడ్జి కడుతామని చెప్పడంతో మంచిర్యాల పట్టణంలో ఓట్లు తగ్గాయి. కేసీఆర్ ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి చేసిన పనులను ఆపేయడం, కూల్చేస్తామనడంతో ప్రజాధనం వృథా అవుతుందనే ఆలోచన చాలా

మందిలో వచ్చింది. ఇక చెన్నూర్‌లోనూ ఇదే పరిస్థితి ఉంది. చెన్నూర్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ను కాంగ్రెస్ ముందుకు తీసుకెళ్తుందా లేదా.. చెన్నూర్ రెవెన్యూ డివిజన్ ఏమైపోతుంది.. మందమర్రి పామాయిల్ ఫ్యాక్టరీ పనులు ఎందుకు ఆగిపోయాయి.. ఒకప్పుడు రాష్ట్రానికే అభివృద్ధి దిక్సూచిగా వెలుగొందిన చెన్నూర్‌లో ఇప్పుడు ఎలాంటి పనులు జరగడం లేదనే చర్చ ప్రజల్లో మొదలైంది. ఇక్కడ సైతం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణాన్ని ఆపేశారు. అన్నింటికంటే ముఖ్యంగా ఎమ్మెల్యే అందుబాటులో ఉండడం లేదు. ఎమ్మెల్యేపై వ్యతిరేకత కారణంగానే ఆయన కుమారుడికి ఓట్ల మెజార్టీ తగ్గిందని పలువురు చెబుతున్నారు. ఇక బెల్లంపల్లి ఎమ్మెల్యే సైతం పార్ట్‌టైమర్‌గా మారిపోయారు. ఈయన స్థానికంగా అందుబాటులో ఉండడం లేదు. ఆరు నెలల్లో ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి పని ఒక్కటైనా ఉందా అంటే.. అదీ లేదు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎన్నో పనులు జరిగాయి. గ్రామాలకు రహదారి మార్గాలు మెరుగయ్యాయి. ఇంకొన్ని గ్రామాలకు వేయాల్సి ఉంది. ఈ సమస్యపై ఎమ్మెల్యే అసలు దృష్టి పెట్టినట్లే కనిపించడం లేదు. ఎప్పుడోసారి వచ్చిపోతున్నారు తప్పితే జనంలో ఉండడం లేదు. గెలవడానికి ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయడం లేదు. ఈ వ్యతిరేకతే ఇక్కడ సైతం కాంగ్రెస్‌కు ఓట్లను తగ్గించింది.

మూడు నియోజకవర్గాల్లో ఢీలా..

ఆరునెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే కాంగ్రెస్‌కు వచ్చిన మెజార్టీ భారీగా తగ్గడం గమనార్హం. గడ్డం వంశీ నాన్న గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న చెన్నూర్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో 37,515 ఓట్ల మెజార్టీ రాగా, ఎంపీ ఎన్నికల్లో 24,580 ఓట్ల లీడ్ మాత్రమే వచ్చింది. 12,935 ఓట్లు తక్కువగా వచ్చాయి. బెల్లంపల్లిలో వంశీ పెదనాన్న గడ్డం వినోద్‌కు గత అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజార్టీలో 12,298 ఓట్లు ఈ ఎన్నికల్లో తగ్గాయి. ఇక మంచిర్యాల నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 66,116 లీడ్ రాగా, ఎంపీ ఎన్నికల్లో 19,457 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో గత ఎన్నికలతో పోలిస్తే 46,659 ఓట్ల మెజార్టీ తగ్గింది. దీంతో క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ క్యాడర్‌లో నిర్లిప్తత కనిపిస్తున్నది. ఇప్పటికైనా ఎమ్మెల్యేలు లోకల్‌లో ఉంటూ, అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వాములైతే బాగుంటుందని హస్తం పార్టీ నాయకులే చెబుతున్నారు. మరి ఇప్పటికైనా ఎమ్మెల్యేలు ప్రజాగ్రహాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేస్తారా.. లేక మెజార్టీ తగ్గినా గెలిచాం కదా.. మళ్లీ ఎన్నికలు వచ్చినప్పుడు చూసుకుందామనే ధోరణిలోనే ఉండిపోతారా అనేది తేలాల్సి ఉంది.

దండేపల్లిలో చేపమందును నోట్లో వేస్తున్న నిర్వాహకులు ప్రేంరాజ్-భూలక్ష్మి దంపతులు

క్యూలో ఉన్న ప్రజలు

తాండూర్‌లో చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

'చేప మందు'కు స్పందన

- ఉదయం మూడింటి నుంచే క్యూ
- వివిధ ప్రాంతాల నుంచి 10 వేల మంది రాక
- ప్రేంరాజ్ దంపతులకు అభినందనలు

దండేపల్లి, జూన్ 8 : మృగశిర కార్తె ప్రవేశించిన నేపథ్యంలో దండేపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన ఉచిత చేప మందు పంపిణీకి విశేష స్పందన లభించింది. పీఏసీఎస్ చైర్మన్ కాసనగొట్టు లింగన్న, ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్ కార్యక్రమాన్ని ప్రారంభించగా, గ్రామానికి చెందిన రంగసాయి ప్రేంసాగర్–భూలక్ష్మి దంపతులు చేపమందు వేశారు. ఉదయం 3 గంటల నుంచి చేప మందు కోసం క్యూలైన్‌లో నిల్చున్నారు. తమ వెంట తెచ్చుకున్న చేపపిల్లలను నిర్వాహకులు మందుతో పాటు నోట్లోకి వదిలారు. అస్తమా, దగ్గు, దమ్ము, జలుబు,పక్షవాతం, నడుము నొప్పులు తదితర వ్యాధులు నయమవుతాయని నిర్వాహకుడు ప్రేంరాజ్ తెలిపారు. సుమారు 30 మంది వలంటీర్లుగా సేవలందించారు. ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి కరీంనగర్ జిలాల్లతో పాటు మహారాష్ట్ర, ఒడిశా ప్రాంతాలకు చెందిన సుమారు 10 వేల మంది వరకు అస్తమా, ఉబ్బసం వ్యాధిగ్రస్తులు వచ్చి చేప మందును వేసుకున్నారు. చేప మందును ఉచితంగా పంపిణీ చేసిన ప్రేంరాజ్ దంపతులతో పాటు కార్యక్రమానికి సహకరించి, సేవలందించిన ప్రతి ఒక్కరికీ నాయకులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

మంచిర్యాల జిల్లా కేంద్రంలో 14 కిలోల చేపతో మహిళ, చేపల దుకాణాలు

చేపలోయ్ చేపలు..

- మృగశిరకార్తె సందర్భంగా జోరుగా విక్రయాలు
- మార్కెట్‌లలో సందడే సందడి
- జాతరను తలపించిన ప్రాజెక్టులు, చెరువులు

మంచిర్యాల ఏసీసీ/చెన్నూర్/తాండూర్/దహెగాం, జూన్ 8 : మృగశిర కార్తె నేపథ్యంలో చేపల విక్రయాలు జోరందుకున్నాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంతో పాటు చెన్నూర్, తాండూర్, దహెగాం తదితర ప్రాంతాలు అమ్మకాలు చేపట్టగా, కొనుగోలుదారులతో ఆయా ప్రాంతాలు సందడిగా కనిపించాయి. మార్కెట్‌లు సైతం రద్దీగా మారాయి. ఇక ప్రాజెక్టులు, చెరువుల వద్ద చేపలు పట్టి అమ్మగా, నేరుగా అక్కడికే వచ్చి కొనుగోలు చేయడంతో ఆయా ప్రాంతాలు జాతరను తలపించాయి. కిలో బొమ్మె చేపలకు రూ.1000, రహులు రూ.300, పాపర్లు, కొరమీనులు, పాంప్లెట్‌లు, జల్లలు, చందమామ, బంగారు తీగలకు రూ.500 దాకా ధర పలికినా.. ప్రజలు వెనుకాడలేదు. కాగా, మృగశిర కార్తె శనివారం రావడంతో పలుచోట్ల అమ్మకాలు అంతగా సాగలేదు. ఆదివారం గిరాకీ బాగుంటుందని మత్స్యకారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ
విలేకరులు కావలెను
అర్హతలు :
- పాత్రికేయులుగా పనిచేయాలన్న ఉత్సాహం.
- మీ ప్రాంత స్థితిగతులపై అవగాహన.
- తెలుగు భాషపై పట్టు ఉండి.. చక్కగా రాయగలగాలి.
- ఇంటర్ ఉత్తీర్ణత సాధించి.. 35 ఏళ్లలోపు ఉండాలి.
- రిపోర్టింగ్‌పై ఆసక్తి ఉన్నవారురాత పరీక్ష, ఆ తర్వాత ఇంటర్వ్యూలకు హాజరుకావాలి.
- బయోడాటాతో రెండు పాస్ పోర్ట్ సైజు ఫొటోలు తెచ్చుకోగలరు.

మంచిర్యాలకు కావలసిన కేంద్రాలు
1. మంచిర్యాల అర్బన్ 2. పాత మంచిర్యాల 3. గర్మిళ్ల 4. భీమిని 5. బెల్లంపల్లి రూరల్ 6. లక్షెట్టిపేట రూరల్

ఆసిఫాబాద్‌కు కావలసిన కేంద్రాలు
1. ఆసిఫాబాద్ 2. ఆసిఫాబాద్ రూరల్ 3. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ 4. కాగజ్‌నగర్ టౌన్ 5. కాగజ్‌నగర్ ఎస్పీఎం

రాతపరీక్ష తేదీ : 10-06-2024 (సోమవారం)
సమయం : ఉదయం 11 గంటలకు..
స్థలం : వివేకవర్ధిని డిగ్రీ అండ్ పీజీ కాలేజీ, బస్ డిపో వెనక, జాఫర్‌నగర్, మంచిర్యాల జిల్లా.
ఫోన్ నంబర్ : 91827 77502

గ్రూప్-1 ప్రిలిమినరీకి సర్వం సిద్ధం

జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 8 : ఈ నెల 9న నిర్వహించనున్న గ్రూప్ –1 ప్రిలిమినరీకి సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే తెలిపారు. శనివారం జిల్లాలోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల, సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ తో కలిసి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్–1 సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణ కోసం జిల్లాలో 13 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. బూట్లు, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరన్నారు.

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

పటిష్ట భద్రత

రామగుండం కమిషనర్ ఎం.శ్రీనివాస్

మంచిర్యాల ఏసీసీ, జూన్ 8 : గ్రూప్–1 ప్రిలిమినరీకి పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రామగుండం కమిషనరేట్ వ్యాప్తంగా 41 సెంటర్లలో మొత్తం 15,482 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులేకుండా పట్టణ ప్రధాన రోడ్లు, చౌరస్తాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బయోమెట్రిక్ విధానం ద్వారా అటెండెన్స్ తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలి : బెల్లంపల్లి ఏసీపీ

మందమర్రి, జూన్ 8 : గ్రూప్–1 పరీక్షా కేంద్రాల వద్ద నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పేర్కొన్నారు. మందమర్రి పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. మందమర్రి సర్కిల్ పరిధిలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్, సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు పాల్గొన్నారు.

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679